ADVERTISING
నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM
# నేటి దర్శిని
PRGI NO: APTEL/26/A5450
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

విజయవాడ గురువారం 10-09-2026 సంపుటి: 02 సంచిక : 71 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని
Vijayawada Thursday, 10-09-2026 Volume :02 Issue: 71 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani
Contact Number 9059328777

# భూముల భద్రతే లక్ష్యం

## భూమి హక్కులు భద్రతకు ప్రాధాన్యం

- 16 లక్షల ఎకరాలు 22ఏ జాబితా నుంచి తొలగింపు
- రీ సర్వే 2.0తో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం
- పట్టాదారు పాసుపుస్తకాలు ఆధునిక భద్రత
- 8,234 గ్రామాలు రీసర్వే పూర్తి
- 36 లక్షల పాసుపుస్తకాలు పంపిణీ
- 244 కీలక భూ సమస్యలు పరిష్కారం
- నీటి భద్రత గోదావరి జలాల వినియోగం
- రూ.240 కోట్లతో విద్యుత్ గ్రిడ్ ఆధునికీకరణ
- ప్రతి వారము ప్ర జల మధ్యలోనే
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే మూల మంత్రాలు
- పి.గన్నవరం 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభలో సీఎం చంద్రబాబు

"రాష్ట్రంలో గొడ్డలి పార్టీ రౌడీ రౌడీ అంటూ అరాచకాలు చేస్తోంది. ఇలాంటి వారికి నేను ఎప్పుడూ భయపడను. నేను తీవ్రవాదులతో సైతం పోరాడాను. అలిపిరి వద్ద క్లేమోర్ మైన్లతో నాపై దాడి చేశారు. నాకు వెంకటేశ్వర స్వామి పునర్జన్మ ఇచ్చారు. రాయలసీమలో ఫ్యాక్షన్‌ను తొలగించేందుకు మా ఎమ్మెల్యేలనే అరెస్టు చేశా. నేను సమర్థంగా, లేకపోతే నాకే కాదు రాష్ట్రానికే నష్టం. మా హయాంలో డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించి ఉద్యోగాలిచ్చాం. రెవెన్యూ పరంగా ఏ వ్యక్తి నష్టపోకూడదనే కష్టపడుతున్నాను. 20 మంది ఎంపీలను గెలిపించారు, కాబట్టే కేంద్రం నుంచి నిధులు తెలుగుస్తున్నాం. పది పదిహేనేళ్లు కష్టపడి పనిచేస్తే దేశంలో ఏపీ నెంబర్ 1 అవుతుంది. వచ్చే ఎండాకాలంలోపు కోసీసీమలో త్రీఫేజ్ కరెంట్ ఇస్తాం. మహిళలకు వంట గ్యాస్ డబ్బులను 4 నెలలకొకసారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం."

--- సీఎం చంద్రబాబు నాయుడు

02





02

# టిబెట్‌లో మళ్లీ భూకంపం

- నేపాల్‌లో పలు ప్రాంతాల్లో ప్రకంపనలు
- 5.3 తీవ్రతతో భూకంపం
- 35 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం
- భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన ప్రజలు
- నష్టం వివరాలు ఇంకా వెల్లడి కాలేదు
- భారత భూకంప పరిశోధన కేంద్రం ప్రకారం తీవ్రత 5.0
- గత గురువారం కూడా టిబెట్‌లో భూకంపం
- అప్పట్లో 5.1గా నమోదైన భూకంప తీవ్రత
- 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం
- వరుస భూకంపాలతో టిబెట్, నేపాల్‌లో ఆందోళన



## నిజం గెలిచింది..
# నీతి నిలిచింది

- చంద్రబాబు అరెస్టుకు మూడేళ్లు
- కుట్రపూరిత కేసులో 53 రోజుల నిర్బంధం
- నాటి చీకటి రోజుకు నిరసనగా 53 కొవ్వొత్తులు
- కొవ్వొత్తులు వెలిగించిన నారా లోకేష్
- రాష్ట్రవ్యాప్తంగా చంద్రబాబుకు టీడీపీ శ్రేణుల సంఘీభావం
- తప్పుడు కేసుల నుంచి చంద్రబాబు బయటపడ్డారని లోకేష్ వ్యాఖ్య
- కోట్లాది తెలుగు ప్రజల ఆశీస్సులు చంద్రబాబుకు అండగా నిలిచాయని వెల్లడి
- ప్రజాబలమే టీడీపీకి, చంద్రబాబుకు శ్రీరామరక్ష అని ధీమా

ఏపీ బ్యూరో:
సరిగ్గా మూడేళ్ల క్రితం ఇదే రోజు రాజకీయ దురుద్దేశంతో జగన్ కుట్రపూరితంగా పెట్టించిన తప్పుడు కేసులో చంద్రబాబును అర్ధరాత్రి వేళ అరెస్టు చేశారు. 53 రోజుల పాటు జైలులో నిర్బంధించారు. నాటి చీకటి రోజును నిరసిస్తూ.. 'నిజం గెలిచింది' నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా కొవ్వొత్తులు వెలిగించి సీఎం చంద్రబాబుకి ప్రజలు సంఘీభావం ప్రకటించారు. Undavalli నివాసంలో తెలుగుదేశం పార్టీ

-మిగతా 2 లో

# తెలుగు రాష్ట్రాలకు రైల్వే లైన్లు

- రూ. 10,021 కోట్లతో భారీ మల్టీ-ట్రాకింగ్
- ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం!
- సికింద్రాబాద్ - కాజీపేట, అరకోణం - రేణిగుంట మార్గాలలో మల్టీట్రాకింగ్ పనులకు గ్రీన్ సిగ్నల్
- దేశవ్యాప్తంగా 17 జిల్లాల్లో 540 కి.మీ మేర పెరగనున్న రైల్వే నెట్‌వర్క్
- 2029-30 నాటికి ప్రాజెక్టుల పూర్తికి లక్ష్యం

02





## ప్రశ్నలకు బదులివ్వలేకనే
# సస్పెన్షన్

- మైకులు ఆపినా ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ పోరాటం ఆగదు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో హిట్లర్ నియంతృత్వ పోకడలు
- నిర్బంధం పెరిగితే తిరుగుబాటే
- కాంగ్రెస్ ప్రభుత్వం అహంకారానికి తెలంగాణ ప్రజలే బుద్ధి చెప్తారు
- బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు

హైదరాబాద్,
శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులపై వేటు వేయడం అంటే ప్రతిపక్షాన్ని సస్పెండ్ చేయడం కాదని, తెలంగాణ ప్రజలగొంతు నొకడమేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ టీ హరీశ్‌రావు పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు అంటే ప్రతిపక్షాన్ని వేధించడం, టార్గెట్ చేయడం కాదని, ప్రజల సమస్యలపై లోతుగా చర్చించి పరిష్కారం చూపడం అని బుధవారం

-మిగతా 2 లో

## వచ్చే ఏడాది సెప్టెంబర్--అక్టోబరులో
# పాదయాత్ర

## స్థానిక ఎన్నికల్లో గట్టిగా నిలబడి పోరాడాలి

- ఎన్నికలు నిజాయితీగా జరిగితే వైఎస్సార్‌సీపీదే విజయం
- స్థానిక ఎన్నికలు కార్యకర్తల ఎన్నికలన్న జగన్
- కార్యకర్తలకు పార్టీ అండగా నిలవాలని పిలుపు
- బీసీ రిజర్వేషన్ల పేరుతో చంద్రబాబు డ్రామా చేస్తున్నారని విమర్శ
- ఎన్నికలు ఎప్పుడు జరిగినా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచన
- అధికార దుర్వినియోగానికి పాల్పడినా వెనుకడుగు వేయొద్దని పిలుపు
- పజల పక్షాన కార్యకర్తలు నిలబడాలని జగన్ సూచన
- తమ హయాంలో 99 శాతం హామీలు అమలు చేశామని వెల్లడి
- దౌర్జన్యంతో పాలకులు ఎప్పటికీ రాజ్యం చేయలేరని వ్యాఖ్య

తాడేపల్లి,
వచ్చే ఏడాది సెప్టెంబరు లేదా అక్టోబరులో పాదయాత్ర ప్రారంభిస్తానని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పర్చూరు నియోజకవర్గం మీదుగా కూడా యాత్ర సాగుతుందని చెప్పారు. పర్చూరు నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలతో తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

-మిగతా 2 లో





# తీవ్రమైన 'జల' యుద్ధం


- ఐదు ఇరాన్ చమురు ట్యాంకర్లపై అమెరికా దాడులు
- ప్రతీకారంగా జోర్డాన్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులు
- అమెరికా నౌకపై బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించిన టెహ్రాన్
- అమెరికా దాడిలో ఓ చమురు నౌక నీటిలో మునక
- జోర్డాన్‌పై 20 బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ దాడి
- 18 క్షిపణులను కూల్చివేశామని జోర్డాన్ వెల్లడి
- బహెరెన్, కువైట్ సమీపంలోని ట్యాంకర్లకు ఇరాన్ హెచ్చరిక
- ఘర్షణలతో బ్యారెల్ చమురు ధర 100 డాలర్లు దాటింది
- ఇరాన్ దాడులకు ప్రతిసారీ ప్రతీకారం తప్పదన్న అమెరికా
- మధ్యప్రాచ్యంలో ముదిరిన అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతలు

02

# డిఫెన్స్‌పై భారత్ ఫోకస్!

- పుతిన్‌తో మోదీ భేటీలో రక్షణ సహకారమే కీలక ఎజెండా
- రేపు భారత్‌కు రానున్న రష్యా అధ్యక్షుడు పుతిన్
- బ్రిక్స్ సమావేశానికి ముందే మోదీతో కీలక భేటీ
- ఎస్-400 వ్యవస్థల అదనపు కొనుగోలుపై చర్చ
- సు-57 ఐదో తరం యుద్ధ విమానాలపై ఇరుదేశాధినేతల చర్చ
- బ్రహ్మోస్ క్షిపణుల ఆధునీకరణపైనా చర్చించే అవకాశం
- సైనిక, సాంకేతిక సహకారంపై ప్రధానంగా దృష్టి
- సు-57 సాంకేతికతను భారత్‌కు అందించేందుకు రష్యా సిద్ధం
- రక్షణ చర్చలకు పుతిన్ రాకతో అంతర్జాతీయంగా పెరిగిన ఆసక్తి
- బ్రిక్స్ కంటే మోదీ-పుతిన్ భేటీపైనే అంతర్జాతీయ ఫోకస్

02



# నేడు భారత్, బంగ్లాదేశ్ సెమీస్

- ఫైనల్ బెర్త్‌పై కన్నేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన
- తొలి సెమీఫైనల్‌లో బంగ్లాదేశ్‌తో తలపడనున్న భారత్
- గ్రూప్ దశలో ఏకపక్ష విజయాలతో జోరుమీదున్న టీమ్‌ఇండియా
- గత సీజన్‌లో బంగ్లాదేశ్ చేతిలో ఎదురైన పరాజయానికి ప్రతీకారం లక్ష్యం
- స్మృతీ మంధాన, షెఫాలీ వర్మ, ప్రతికా రావల్ మంచి ఫామ్‌లో
- స్పిన్నర్లు శ్రీ చరణి, దీప్తి శర్మలపై భారీ ఆశలు
- మిడిల్ ఆర్డర్‌లో హర్మన్‌ప్రీత్, రిచా ఘోష్, భార్తి ఫుల్‌మాలీ కీలకం
- భారత బ్యాటింగ్‌ను కట్టడి చేయడమే బంగ్లాదేశ్ లక్ష్యం
- మారుఫా అక్తర్, ఫహిమా ఖాటున్, నహిదాల బౌలింగ్‌పై బంగ్లా ఆశలు
- దుబాయ్ పిచ్‌పై బౌలర్ల ప్రణాళికలే కీలకం
- ఫైనల్ బెర్త్ కోసం ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు

02



# టిబెట్‌లో మళ్లీ భూకంపం..



- -నేపాల్‌లో పలు ప్రాంతాల్లో ప్రకంపనలు
- -5.3 తీవ్రతతో భూకంపం
- -35 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం
- -భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన ప్రజలు
- -నష్టం వివరాలు ఇంకా వెల్లడి కాలేదు
- -భారత భూకంప పరిశోధన కేంద్రం ప్రకారం తీవ్రత 5.0
- -గత గురువారం కూడా టిబెట్‌లో భూకంపం
- -అప్పట్లో 5.1గా నమోదైన భూకంప తీవ్రత
- -10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం
- -వరుస భూకంపాలతో టిబెట్, నేపాల్‌లో ఆందోళన

టిబెట్ లో బుధవారం భారీ భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో పొరుగు దేశమైన నేపాల్ లోనూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. రిక్టర్ స్కేలు పై ఈ భూకంప తీవ్రత 5.3 గా నమోదైంది. యూరోపియన్-మెడిటరేనియన్ సిస్మోలాజికల్ సెంటర్ వెల్లడించింది. భూ అంతర్భాగంలో 35 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు ఈ సంస్థ పేర్కొన్నది.కాగా భారత జాతీయ భూకంప పరిశోధన కేంద్రం మాత్రం భూకంప తీవ్రతను 5.0 గా నిర్ధారించింది. టిబెట్‌లో సంభవించిన ఈ భూకంపం కారణంగా నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో భూమి కంపించడంతో, భయాందోళనకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ భూకంపం వల్ల సంభవించిన ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన అధికారిక వివరాలు ఇంకా వెలువడాల్సి ఉంది. గత గురువారం కూడా టిబెట్‌లో భూకంపం సంభవించింది. అప్పట్లో దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.1గా నమోదైందని, భూకంప కేంద్రం 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది.

## ప్రశ్నలకు బదులివ్వలేకనే సస్పెన్షన్

(మొదటి తరువాయి)

విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. మూడు రోజులుగా సాగుతున్న సమావేశాల్లో ఒక ప్రజా సమస్యపైనైనా సమగ్ర చర్చ జరిగిందా? ఏ ఒక ప్రభుత్వ విధానంపైనైనా స్పష్టత ఇచ్చారా? అని ప్రశ్నించారు.

సభలో తమ గొంతు వినిపించాలంటూ వేల మంది వినతులు

అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్నాయని తెలిసి రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు ఎన్నో ఆశలతో తమను కలిసి వందలాది వినతిపత్రాలు అందజేశారని హరీశ్‌రావు వెల్లడించారు. తమ బాధలను, సమస్యలను శాసనసభ వేదికగా లేవనెత్తాలంటూ ప్రజలు, ఉద్యోగులు, యువకులు నిరంతరం ఫోన్లు చేస్తూ మెసేజ్‌లు పెడుతున్నారని తెలిపారు. ప్రజలు తమ గొంతును అసెంబ్లీలో వినిపించాలని ప్రాధేయపడుతుంటే, చర్చ జరగకుండా తమను బలవంతంగా బయటకు పంపించి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనలో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని ఆరోపించారు.రాజకీయ వార్తలు చదవండి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ ఎప్పుడు పూర్తి చేస్తారని ఆర్టీసీ కార్మికులు, నిషేధిత జాబితా నుంచి తమ భూములను ఎప్పుడు తొలగిస్తారని రైతులు, జీవో 97ను ఎప్పుడు రద్దు చేస్తారని పాలిటెక్నిక్ విద్యార్థులు నిలదీస్తున్నారని పేర్కొన్నారు. వీటితోపాటు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు, డీఏ, పీఆర్సీ కోసం ఉద్యోగులు, కారుణ్య నియామకాల కోసం సింగరేణి కార్మికులు, పెన్షన్ల పెంపు కోసం వృద్ధులు కండ్లల్లో ఒత్తులు వేసుకొని చూస్తున్నారని, ఈ అంశాలన్నీ సభలో ప్రస్తావనకు వస్తే జవాబు చెప్పలేమన్న భయంతోనే ప్రభుత్వం తమను సస్పెండ్ చేసి పారిపోయిందని దుయ్యబట్టారు.

మైకులు కట్ చేసినా.. ప్రజాక్షేత్రంలో గొంతును నొకలేరు

శాసనసభలో మైకులు కట్ చేసి, సభ్యులను సస్పెండ్ చేసి బలవంతంగా గొంతు నొకవచ్చేమో గానీ ప్రజాక్షేత్రంలో తమ గళాన్ని ఆపడం ఎవరి తరమూ కాదని హరీశ్‌రావు స్పష్టంచేశారు. ప్రభుత్వం ఎంతగా అణచివేయాలని చూస్తే, ప్రజాసమస్యలపై బీఆర్ఎస్ పార్టీ రెట్టింపు ఉత్సాహంతో పోరాడుతుందని తేల్చిచెప్పారు. అధికారం శాశ్వతం కాదని, నియంతృత్వ వైఖరితో ఎకువ కాలం ప్రజాస్వామ్యాన్ని బందీ చేయలేరని హెచ్చరించారు. గతంలో తనకు హిట్లర్ ఆదర్శమని స్వయంగా చెప్పుకున్న రేవంత్‌రెడ్డి, నేడు అదే తరహా నియంతృత్వ పోకడలతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి నిరంకుశ పాలకులు చరిత్ర ఇచ్చే తీర్పు నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. తెలంగాణ సాధించిన కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతల వ్యక్తిగత దూషణలు, రాజకీయ కక్షసాధింపు చర్యలను రాష్ట్ర ప్రజలు అత్యంత నిశితంగా గమనిస్తున్నారని తెలిపారు.

## నేడు భారత్, బంగ్లాదేశ్ సెమీస్

దుబాయ్ (యుఏఈ) :




అజేయ రికార్డుతో సెమీఫైనల్‌కు చేరుకున్న భారత మహిళల జట్టు.. నేడు ఫైనల్ బెర్త్‌పై కన్నేసి బరిలోకి దిగుతున్నారు. గ్రూప్ దశలో ఏకపక్ష విజయాలు నమోదు చేసిన హర్మన్‌ప్రీత్‌కౌర్ సేన నేడు కీలక సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది. గత సీజన్‌లో బంగ్లాదేశ్ చేతిలో భంగపడిన టీమ్ ఇండియా.. నేడు ఆల్‌రౌండ్ షోతో ఫైనల్లో అడుగుపెట్టేందుకు రంగం సిద్ధం చేసుకుంది. మహిళల ఆసియా కప్‌లో భారత్, బంగ్లాదేశ్ తొలి సెమీఫైనల్ పోరు నేడు.

జోరుమీదున్న భారత్

టైటిల్ ఫేవరేట్‌గా ఆసియా కప్‌లో అడుగుపెట్టిన టీమ్ ఇండియా గ్రూప్ దశలో ఆ ట్యాగ్‌కు న్యాయం చేసింది. ఓపెనర్ స్మృతీ మంధాన పరుగుల వరద పారిస్తుండగా.. స్పిన్నర్లు శ్రీ చరణి, దీప్తి శర్మలు మ్యాజిక్ చేస్తున్నారు. స్మృతీ మంధాన, షెఫాలీ వర్మ, ప్రతికా రావల్ మంచి ఫామ్‌లో ఉన్నారు. మిడిల్ ఆర్డర్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్, భార్టి ఫుల్‌మాలీ తమదైన ఇన్నింగ్స్ బాకీ పడ్డారు. దీప్తి వర్మ, ప్రేమ రావత్, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, నందని శర్మలు నిలకడగా రాణిస్తున్నారు. దీంతో భారత్ నేడు సెమీఫైనల్లో ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది.

బౌలర్లపైనే భారం

గత ఆసియా కప్‌లో భారత్‌పై సంచలన విజయం సాధించిన బంగ్లాదేశ్ నేడు సెమీఫైనల్లోనూ అటువంటి ప్రదర్శన పునరావృతం చేయాలనే ఆలోచనతో కనిపిస్తోంది. స్వింగ్ బౌలర్ మారుఫా అక్తర్, ఫహిమా ఖాటున్, నహిదాలపై బంగ్లాదేశ్ ఎక్కువుగా ఆశలు పెట్టుకుంది. భారత బ్యాటింగ్ లైనప్‌ను స్వల్ప స్కోరుకు పరిమితం చేయటమే బంగ్లాదేశ్ గేమ్ ప్లాన్‌గా కనిపిస్తోంది. దుబాయ్ పిచ్ పరిస్థితుల్లో ఎవరి బౌలింగ్ ప్రణాళికలు పట్టాలెక్కుతాయో చూడాలి.

# నిజం గెలిచింది.. నీతి నిలిచింది

(మొదటి తరువాయి)

జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ 53 కొవ్వొత్తులు వెలిగించారు. ఐదు దశాబ్దాల నిస్వార్థ రాజకీయ విలువల శిఖరం నారా చంద్రబాబునాయుడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది తెలుగు ప్రజల ఆశీస్సులతో కడిగిన ముత్యములా తప్పుడు కేసుల నుంచి బయటకు వచ్చారని పేర్కొన్నారు. ప్రజా బలమే తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబుకు శ్రీరామరక్ష అని ధీమా వ్యక్తం చేశారు.



# భూముల భద్రతే లక్ష్యం

**పి.గన్నవరం,**

: సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడమే నిజమైన సుపరిపాలన అని అన్నారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పండువారిపాలెంలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభలో సీఎం పాల్గొని మాట్లాడారు. ప్రతి నెల వీలైనన్ని సార్లు ప్రజల మధ్యకు వెళ్లి వారి బాగుగోలు తెలుసుకుంటున్నానని సీఎం చెప్పారు. ప్రతి నెల మొదటి తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ సందర్భంగా పేదలను కలుస్తున్నానని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలోనూ పాల్గొంటున్నట్లు చెప్పారు. పి4 కార్యక్రమం ద్వారా సామాజిక బాధ్యతతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి, సంపద సృష్టి ద్వారా ప్రజలందరూ గౌరవంగా జీవించేలా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.

**భూమిపై హక్కులకు భద్రత**

ప్రతి నెల 9వ తేదీన 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొని రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. రైతులు, భూ యజమానులకు భూమిపై పూర్తి హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత పాలకులు రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి వ్యవస్థను నిర్వీర్యం చేశారని సీఎం ఆరోపించారు.




ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా ప్రజల భూములను కాజేసే ప్రయత్నం జరిగిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేసిందని తెలిపారు. గతంలో రీసర్వే పేరిట అనేక అక్రమతవకలు జరిగాయని విమర్శించారు. భూ రికార్డులకు మరింత భద్రత కల్పించేందుకు ఈ-క్యాప్స్, క్యూఆర్ కోడ్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ వంటి ఆధునిక భద్రతా ఫీచర్లతో పట్టాదారు పాస్‌పుస్తకాలను జారీ చేస్తున్నామని సీఎం వెల్లడించారు.

**16 లక్షల ఎకరాలు 22ఏ నుంచి తొలగింపు**

రాష్ట్రంలో ఇప్పటివరకు 8,234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 36 లక్షల రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేశామని చంద్రబాబు తెలిపారు. వచ్చే మార్చి నాటికి 8,582 గ్రామాల్లో 56 లక్షల పాస్‌పుస్తకాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే ఆటో మ్యూటేషన్ సేవలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని రూ.వెయ్యికే పరిమితం చేయడంతో 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలిగిందన్నారు. రెవెన్యూ రికార్డుల్లో తప్పులను సరిచేసి 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించామని సీఎం వెల్లడించారు. శెట్టిపల్లి, కంగోంది, వడ్డిపరుకూరు, ముదినేపల్లి తదితర ప్రాంతాల్లో దశాబ్దాలుగా పరిష్కారం కాని 244 కీలక భూ సమస్యలను పరిష్కరించామని చెప్పారు. అమలాపురం, మాచవరం, ముమ్మిడివరం, రామచంద్రాపురం ప్రాంతాల్లో బ్రిటిష్ కాలం నాటి కొనసాగుతున్న భూ సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామని చెప్పారు. 56.37 ఎకరాల భూమికి సంబంధించి 1,410 మందికి లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

రాష్ట్రంలో నీటి భద్రత, భూమి భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చంద్రబాబు అన్నారు. ఎల్నినో ప్రభావం ఉన్నప్పటికీ ఈ ఏడాది గోదావరి నుంచి వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలోకి వెళ్తిందని తెలిపారు. ఆ నీటిని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ దెబ్బతినడం, కాంట్రాక్టర్లను మార్చడం వంటి కారణాలతో పనులు ఆలస్యమయ్యాయని సీఎం పేర్కొన్నారు. 2024లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన మద్దతు ఢిల్లీలోనూ రాష్ట్రానికి అదనపు ప్రయోజనం చేకూరుస్తోందని, తద్వారా మరిన్ని నిధులు సాధించగలుగుతున్నామని తెలిపారు.

# తెలుగు రాష్ట్రాలకు రైల్వే లైన్లు

- - రూ. 10,021 కోట్లతో భారీ మల్టీ-ట్రాకింగ్
- - ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం!
- - సికింద్రాబాద్ - కాజీపేట, అరక్కోణం - రేణిగుంట మార్గాలలో మల్టీట్రాకింగ్ పనులకు గ్రీన్ సిగ్నల్
- - దేశవ్యాప్తంగా 17 జిల్లాల్లో 540 కి.మీ మేర పెరగనున్న రైల్వే నెట్‌వర్క్
- - 2029-30 నాటికి ప్రాజెక్టుల పూర్తికి లక్ష్యం



న్యూఢిల్లీ,

తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ పరిధిలో 17 జిల్లాల మీదుగా ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారమిక్కడ సమావేశమైన కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ. 10,021 కోట్ల అంచనా వ్యయంతో సుమారు 540 కి.మీ. మేర భారత రైల్వే పరిధిని పెంచే ఈ ప్రాజెక్టులను 2029-30 నాటికి పూర్తి చేసేలా ప్రణాళికల రూపకల్పన జరిగినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

ప్రాజెక్టుల వివరాలు

-అరక్కోణం - రేణిగుంట 3, 4వ లైన్ - 77 కిలోమీటర్లు
- వైట్ ఫీల్డ్ - బంగారుపేట 3, 4వ లైన్ - 47 కిలోమీటర్లు
- హోసూర్ - ఒమలూర్ డబ్లింగ్ (రెండు లైన్ల నిర్మాణం) - 147 కిలోమీటర్లు
- సేలం - కరూర్ - దిండిగల్ డబ్లింగ్ - 159 కిలోమీటర్లు
- సికింద్రాబాద్ మల్టీ ట్రాకింగ్ (ఘటకేసర్) - కాజీపేట్ - 110 కిలోమీటర్లు

ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు అనుసంధానం

పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఈ ప్రాజెక్టులను రూపొందించారు. సమగ్ర ప్రణాళిక, భాగస్వాముల సంప్రదింపుల ద్వారా మల్టీ మోడల్ అనుసంధానతను, రవాణా సామర్థ్యాన్ని పెంపొందించడం ఈ ప్రాజెక్టుల ఉద్దేశం. ప్రజలు, సరుకులు, సేవల రవాణాకు అంతరాయం లేని అనుసంధానతను ఇవి అందిస్తాయి. ఈ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 52 లక్షల జనాభా గల దాదాపు 2,121 గ్రామాలకు అనుసంధానాన్ని మెరుగుపరుస్తాయి.

ఆమోదం పొందిన ఈ ప్రాజెక్టుల ద్వారా తిరుపతి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయం (తిరుత్తణి), శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం (తిరుచానూరు), కోటిలింగేశ్వర దేవాలయం, శ్రీ నీల భైరవేశ్వర స్వామి ఆలయం, బంగారు తిరుపతి, కోలార్ బంగారు గనులు, హోగెనక్కల్ జలపాతం, హోసూర్ కోట, మెట్టూర్ డ్యామ్, కొడైకెనాల్ కొండలు, సత్యమంగళం వన్యప్రాణుల అభయారణ్యం, నమక్కల్ ఆంజనేయర్ ఆలయం, నమక్కల్ కోట, కళ్యాణ పశుపతేశ్వర ఆలయం, యాదగిరిగుట్ట ఆలయం, భువనగిరి కోట, సురేంద్రపురి, స్వర్ణగిరి ఆలయం వంటి దేశవ్యాప్తంగా ఉన్న పలు ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు రైలు అనుసంధానం మెరుగవుతుంది. బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు, కంటైనర్లు, ఆటోమొబైల్స్, ఆహారధాన్యాలు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎరువులు వంటి వస్తువుల రవాణాకు ఈ ప్రాజెక్టులు కీలక మార్గాలు. ఈ పెంపుదల ద్వారా ఏటా అదనంగా 47 ఎంటీపీఏ (ఏడాదికి మిలియన్ టన్నుల) సరుకు రవాణా సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు.

# వచ్చే ఏడాది సెప్టెంబర్--అక్టోబరులో పాదయాత్ర

(మొదటి తరువాయి)




స్థానిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని, ఎన్నికల్లో గట్టిగా నిలబడి పోరాడాలని జగన్ పిలుపునిచ్చారు. ఎన్నికలు నిజాయితీగా జరిగితే వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని అన్నారు. స్థానిక ఎన్నికలు కార్యకర్తలకు సంబంధించినవని, ప్రజలకు కార్యకర్తలు అండగా నిలుస్తారని, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశం, ఓటర్ల జాబితాల సమగ్ర సవరణలో 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయన్న ప్రచారం నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై అనుమానాలు ఉన్నాయని జగన్ పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడినా కార్యకర్తలు వెనుకడుగు వేయకుండా ప్రజల పక్షాన నిలబడాలని సూచించారు.

తమ ప్రభుత్వ హయాంలో మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని, విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామ సచివాలయాల వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చామని జగన్ తెలిపారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. దౌర్జన్యంతో పాలకులు ఎప్పటికీ రాజ్యం చేయలేరని ఆయన స్పష్టం చేశారు.

## తీవ్రమైన 'జల' యుద్ధం


జనరల్ డెస్క్)



మధ్యప్రాచ్యంలో 'జల' యుద్ధం తీవ్ర మైంది. అమెరికా సైనిక దళాలు మంగళవారం ఐదు ఇరాన్ చమురు ట్యాంకర్లపై దాడి చేశాయి. వీటిలో ఒక దానిని నీటిలో ముంచేశాయి. దీనికి ప్రతీకారంగా అమెరికా నౌకాదళానికి చెందిన యుద్ధ నౌకపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అంతేకాక జోర్డాన్‌లోని అమెరికా సైనిక ఆస్తులను లక్ష్యంగా చేసుకొని వరుసగా బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇదిలావుండగా అమెరికా-ఇరాన్ ఘర్షణలు, సౌదీ అరేబియాలో హౌతీల దాడుల నేపథ్యంలో చమురు ధర బుధవారం బ్యారల్‌కు వంద డాలర్లు దాటింది. జూలై తర్వాత చమురు ధర ఈ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో నాలుగు ముడి చమురు రవాణా నౌకలపై, పర్షియన్ గల్ఫ్‌లో ఇరాన్ చమురు ఎగుమతులకు కేంద్రంగా ఉన్న ఖర్గ్ దీవి సమీపంలో ఓ నౌకపై దాడి చేశామని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) తెలిపింది. వీటిలో ఎం/టీ రెస్కో అనే నౌక మంటల్లో చిక్కుకొని గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో మునిగిపోయింది. తాను లక్ష్యంగా చేసుకున్న నౌకలపై దాడి చేయడానికి ముందు వాటిని వదిలేసి వెళ్లిపోవాలని సిబ్బందిని అమెరికా దళాలు ఆదేశించాయి. రెండు నౌకలలోని సిబ్బందిని లైఫ్‌బోట్లలో ఒడ్డుకు చేర్చారు. గత రెండు రోజులుగా తన నౌకలపై ఇరాన్ రెండుసార్లు దాడులకు ప్రయత్నించడంతో అమెరికా ప్రతిదాడులకు దిగింది. అమెరికా నౌక ఇరాన్ క్షిపణులను తప్పించుకొని ప్రాంతీయ జలాలలో గస్తీని కొనసాగిస్తోందని సెంట్‌కామ్ తెలియజేసింది. అమెరికా దాడులపై మండిపడిన ఇరాన్ సేనలు జోర్డాన్‌పై పెద్ద ఎత్తున క్షిపణు లను ప్రయోగించాయి. అమెరికా దళాలు ఉపయోగిస్తున్న మువఫ్ఫాక్ సాల్టీ వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు జరిపాయి. ఇరాన్ వైపు నుంచి 20 బాలిస్టిక్ క్షిపణులు దూసుకొచ్చాయని, వాటిలో 18 క్షిపణులను తమ గగనతల రక్షణ వ్యవస్థలు విజయ వంతంగా ధ్వంసం చేశాయని, రెండు క్షిపణులు నిర్జన ప్రాంతాలలో పడ్డాయని జోర్డాన్ చెప్పింది. కాగా బహెరెన్, కువైట్ ఓడరేవుల సమీపంలో ఉన్న చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరికలు జారీ చేసింది. నౌకలు లంగరు వేసి ఉన్నా లేదా ఓడరేవులలో నిలిచి ఉన్నా వెంటనే వదిలేయాలని ఐఆర్‌జీసీ సూచించింది. అయితే ఇరాన్ తమ నౌకలపై దాడి చేసిన ప్రతిసారీ తాము ప్రతీకార దాడులు జరుపుతామని కొలంబియా పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో హెచ్చరించారు.

## డిఫెన్స్‌పై భారత్ ఫోకస్!

నేషనల్ బ్యూరో:



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రేపు (శుక్రవారం) భారత్‌కు రానున్నారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం కోసం ఆయన వస్తున్నారు. సెప్టెంబరు 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత మంటపంలో ఈ సదస్సు జరుగుతుంది. అంతకుముందే మోడీతో పుతిన్ కీలక భేటీలో పాల్గొంటారని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. ఈ సమావేశంలో డిఫెన్స్ సహకారం పైనే ఇరుదేశాధినేతలు ప్రధానంగా చర్చిస్తారని తెలుస్తోంది. ముఖ్యంగా ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు, రష్యా తయారు చేసిన ఐదో తరం సు-57 ఫైటర్ జెట్, బ్రహ్మోస్ మిస్సైల్స్ అప్‌గ్రేడ్ చేయడంపై మోడీ, పుతిన్ చర్చించనున్నట్లు సమాచారం. మిలిటరీ, టెక్నికల్ సహకారంపై ఈ భేటీలో ప్రధానంగా ఫోకస్ పెట్టనున్నట్లు రష్యా అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ తెలియజేశారు. కొంతకాలంగా తమ ఐదో తరం సు-57 ఫైటర్ జెట్‌లను భారత్‌కు అమ్మడంతోపాటు, వాటి టెక్నాలజీని కూడా పూర్తిగా భారత్‌కు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు రష్యా పలుమార్లు చెప్పిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం భారత్ కూడా ఐదో తరం ఫైటర్ జెట్స్ కోసం ప్రయత్నాలు చేస్తోంది. అలాగే ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత రక్షణలో కీలక పాత్ర పోషించిన ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను కూడా అదనంగా కొనుగోలు చేసేందుకు భారత్ సిద్ధంగా ఉన్న సంగతి తెలిసిందే. స్వయంగా పుతిన్ వచ్చి రక్షణ చర్చలు జరపనున్న నేపథ్యంలో.. బ్రిక్స్ సమావేశం కన్నా ఈ భేటీపై అంతర్జాతీయంగా ఫోకస్ పెరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎస్-400 డెలివరీలపై చర్చ

రష్యాతో ఐదు ఎస్-400 ట్రయంఫ్ సిస్టంల కోసం 2018లోనే 5.43 బిలియన్ డాలర్ల ఒప్పందాన్ని భారత్ చేసుకుంది. వీటిలో మూడింటిని రష్యా ఇప్పటికే డెలివరీ చేయగా.. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా మిగతా రెండింటి డెలివరీ ఆలస్యమైంది. వీటిని ఈ ఏడాదిలోనే అందిస్తామని రష్యాస్తోంది. ఇక వ్యూహాత్మకంగా మరింత కీలకమైన అంశం సు-57 ఫైటర్ జెట్స్ అని చెప్పొచ్చు. ఈ జెట్స్‌ను భారత్‌కు అమ్మే అంశం పుతిన్ ఎజెండాలో ప్రధానంగా ఉందని పెస్కోవ్ తెలిపారు. భారత వాయుసేన తమ కాంబ్యాట్ ఎయిర్‌క్రాఫ్ట్ సంఖ్యను బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న వేళ.. ఈ ఐదో తరం ఫైటర్ జెట్ ఎయిర్‌ఫోర్స్‌కు అందితే ఐఏఎఫ్‌కు అనూహ్య బలం చేకూరనుంది. భారత్ మాత్రం కేవలం జెట్స్ కొనడం కంటే వాటి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ చేసుకొని, స్థానికంగానే సు-57 జెట్స్‌ను తయారు చేయాలని ఆలోచిస్తోంది. భారత సైంటిస్టులు ఈ విచారాలు అడుగుతున్నట్లు పెస్కోవ్ కూడా ధ్రువీకరించారు. వీటితోపాటు భారత సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ 'బ్రహ్మోస్'ను అప్‌గ్రేడ్ చేసే అంశంపై కూడా పుతిన్, మోడీ భేటీలో చర్చ జరగనున్నట్లు పెస్కోవ్ వెల్లడించారు.

WWW.NETIDARSHINI.COM
PRGI NO:APTEL/26/A5450
సత్య శోధనే మా లక్ష్యం

## వీధి వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా లోక కళ్యాణ్ మేళా శిబిరాలు





**ముమ్మిడివరం,సెప్టెంబర్ 9, ( నేటి దర్శిని )**
ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పి యం స్వానిది లబ్దిదారులకు లోక కళ్యాణ్ మేళ శిబిరాలను సెప్టెంబర్ 01 నుండి సెప్టెంబర్ 30 వ తేది వరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వీధి వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం యూనియన్ బ్యాంకు నందు నిర్వహించారు. కమ్యూనిటీ ఆర్గనైజేషన్ ఏ.దేవకీ దేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వనిధి పథకం ద్వారా చిరువ్యాపారులు, వీధి వ్యాపారులు ఎలాంటి గ్యారెంటీ లేకుండా సులభంగా రుణాలు పొందవచ్చు అన్నారు. క్రమం తప్పకుండా రుణాలు చెల్లించే వారికి తదుపరి విడతలలో మరింత ఎక్కువ మొత్తంలో రుణాలు అందుతాయని, అలాగే డిజిటల్ చెల్లింపులు ప్రోత్సహించడం ద్వారా క్యాష్‌బ్యాక్ ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయని వివరించారు. బ్యాంక్ మేనేజరు ఎన్ దీలిప్ కుమార్ మాట్లాడుతూ అర్హులైన వీధి వ్యాపారులందరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. శిబిరంలో పాల్గొన్న రిసోర్స్ పర్సన్లు వ్యాపారులకు అవసరమైన పత్రాలను సేకరించి, దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయడంలో సహాయపడ్డారు. ఈ మేళా ద్వారా పలువురు వీధి వ్యాపారులకు నూతన రుణాలు మంజూరు మరియు క్రెడిట్ కార్డ్స్ అప్రోవల్స్, పాత రుణాల పునరుద్ధరణను కూడా చేపట్టినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు,విధి వ్యాపారస్తులు,బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## చొల్లంగిపేట గ్రామంలో హెచ్ఐవి మరియు ఎయిడ్స్ పై అవగాహన




**తాళ్ళరేవు, సెప్టెంబర్ 9, ( నేటి దర్శిని )**
కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం చొల్లంగిపేట గ్రామంలో హెచ్ ఐ వి మరియు ఎయిడ్స్ పై దిశ మరియు బీమాబాయి మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్.ఐ.వి మరియు ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి మరియు ఎయిడ్స్ రాకుండా ఎటువంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి మరియు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఏ విధంగా సమాజములో కలసి జీవించాలి, హెచ్.ఐ.వి మరియు ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబందం గూర్చి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి,కండోమ్ యొక్క ఉపయోగము గూర్చి, హెచ్.ఐ.వి మరియు ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ చట్టం 2017,ఏ ఆర్ టి మందులు,ఏపీ సాక్స్ యాప్,టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి తెలుపుతూ ,అలానే చెడు వ్యసనాలకు, డ్రగ్స్ వాడటం వల్ల కలిగే నష్టాలు చెబుతూ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీమాబాయి మహిళా మండలి సిబ్బంది మరియు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## తాళ్లరేవులో ప్రారంభమైన పోషణ మాసం 2026 కార్యక్రమాలు



**తాళ్ళరేవు, సెప్టెంబర్ 9, ( నేటి దర్శిని )**
కాకినాడ జిల్లా మండల కేంద్రమైన తాళ్లరేవులో గాంధీనగరం అంగన్వాడి కేంద్రంలో బుధవారం పోషణ మాసం 2026 ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా తాళ్లరేవు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ వై శ్రీదేవి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పర్యవేక్షకులు ఇచ్చే నిభావాని మాట్లాడుతూ తల్లులకు పౌష్టికాహార ప్రాముఖ్యతను గురించి మరియు వైవిధ్యమైన ఆహారం గురించి వివరించారు. నేటి నుంచి అక్టోబర్ 9 వ తారీకు వరకు పోషణ మాసోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, తల్లులు, ఇతర మహిళలు,అంగన్వాడి కార్యకర్తలు జి సూర్యకుమారి,కె శ్రీదేవి,ఎం గంగాభవాని,సునీత,భారతి,సత్యనారాయణమ్మ,సుబ్బలక్ష్మి,మంగాదేవి,వెంకటలక్ష్మి, వేణు తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీపై గోబెల్స్ ప్రచారాన్నే నమ్ముకున్న 'గొడ్డలి పార్టీ'

**హిట్లర్, గోబెల్స్ తరహాలోనే జగన్ అసత్య ప్రచారాలు**
**అద్దె ఛానళ్లతో విద్యావంతుల జీవితాలతో చెలగాటం**
**గ్రూప్-1 కుంభకోణం తీర్పు భయంతోనే కొత్త నాటకాలు**
**టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ధ్వజం**



**కడప, సెప్టెంబర్ 9, ( నేటి దర్శిని )**
మెగా డీఎస్సీపై మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి, వైకాపా నేతలు హిట్లర్, గోబెల్స్ తరహాలో చౌకబారు దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ప్రతి నియామకానికి సంబంధించిన స్పష్టమైన ఆధారాలు, పక్కా లెక్కలతో సమాధానం ఇచ్చినప్పటికీ వైకాపా నేతలు పదే పదే అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
రెండో ప్రపంచ యుద్ధ సమయంలో గోబెల్స్ అసత్యాలను ప్రచారం చేసి జర్మనీని నాశనం చేసినట్లే, నేడు జగన్ తన సొంత మీడియా, అద్దె ఛానళ్లతో రాష్ట్రంలో గందరగోళం సృష్టించాలని చూస్తున్నారని రాంగోపాల్ రెడ్డి విమర్శించారు. కడప జిల్లాలో మెరిటోరియస్ స్పోర్ట్స్ కోటా కింద అర్హత సాధించిన అభ్యర్థులపై, ఆత్మకూరు మండలానికి చెందిన వారిపై వైకాపా మీడియా నిరాధార ఆరోపణలు చేస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారమే టెట్ ఉత్తీర్ణులైన క్రీడాకారులకు నియామకాలు జరిగాయని స్పష్టం చేశారు.

**గ్రూప్-1 కేసు నుంచి దృష్టి మళ్లించే కుట్ర..**
ఈ నెల 17వ తేదీన వైకాపా హయాంలో జరిగిన గ్రూప్-1 కుంభకోణంపై హైకోర్టులో కీలక తీర్పు రానుందని, దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే జగన్ ఈ డీఎస్సీపై అపోహలు సృష్టిస్తున్నారని ఎమ్మెల్సీ ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డికి కనీస డిగ్రీ కూడా లేదని, అందుకే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోలేదని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను బహిరంగంగా చూపించేందుకు సిద్ధంగా ఉన్నారని, దమ్ముంటే జగన్ కూడా తన ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్లను ప్రజల ముందు పెట్టాలని రాంగోపాల్ రెడ్డి సవాల్ విసిరారు.

# డీఎస్సీపై గోబెల్స్ ప్రచారాన్నే నమ్ముకున్న 'గొడ్డలి పార్టీ'

**-నారా లోకేష్ ఎదుగుదలను చూసి ఓర్వలేకే జగన్ ముఠా విషప్రచారం**
**-ఆర్మీకి చేసిన సైనికుడిపై దాడులు ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు**
**-ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించేది లేదు**
**-మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మండిపాటు**



**అన్నమయ్య, సెప్టెంబర్ 9, ( నేటి దర్శిని**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి సమర్థ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ స్పష్టం చేశారు. రైతాంగానికి సాగునీరు అందించే ప్రాజెక్టుల నుంచి పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పన వరకు రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపా నాయకుల దిగజారుడు రాజకీయంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.
'యువగళం' పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారని శ్రీకాంత్ తెలిపారు. గత వైకాపా ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ వేయలేదు, ఒక్క జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని విమర్శించారు. కానీ చంద్రబాబు నాయుడు తొలి సంతకంతో మెగా డీఎస్సీ తెచ్చారని, వైకాపా నాయకులు కోర్టుల్లో 200కు పైగా కేసులు వేసి అడ్డుపడినా, మంత్రి లోకేష్ అహర్నిశలు శ్రమించి 148 రోజుల్లో 16,347 మందికి నియామక పత్రాలు అందేలా రికార్డు సృష్టించారని కొనియాడారు.

# గంజాయి బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలి

**- విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్ఐ, వైద్యాధికారి**






**చిట్వేలు, సెప్టెంబర్ 9, ( నేటి దర్శిని**
విద్యార్థులు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చిట్వేలు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్. వినోద్ కుమార్ గారు సూచించారు. బుధవారం చిట్వేలు 5 8, 9, 10వ తరగతి విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్వేలు మండల వైద్యాధికారి డాక్టర్ శివ ప్రసాద్ గౌడ్ గారు మాట్లాడుతూ గంజాయి వినియోగం వల్ల శరీర ఆరోగ్యంతో పాటు మానసిక స్థితిపై కూడా ప్రభావం పడుతుందని తెలిపారు. ఏకాగ్రత తగ్గడం, జ్ఞాపకశక్తిపై ప్రభావం, ఆందోళన, ప్రవర్తనలో మార్పులు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. చిన్న వయసులోనే మాదకద్రవ్యాల అలవాటుకు గురైతే చదువుపై కూడా ప్రభావం పడుతుందని విద్యార్థులకు వివరించారు. ఎవరైనా మాదకద్రవ్యాలను విక్రయించడం, సరఫరా చేయడం లేదా వినియోగించేలా ప్రోత్సహించడం తమ దృష్టికి వస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ఎస్. వినోద్ కుమార్ గారు కోరారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన భవిష్యత్తును ఏర్పరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో చిట్వేలు జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి సోఫియా, పాఠశాల ఎన్‌సీసీ ఉపాధ్యాయులు పసుపుల రాజశేఖర్, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మా ఊరి నీటి కష్టాలు తీర్చండి...

**-అధికారులను కోరిన రెడ్డివారిపల్లి గ్రామస్తులు**



**తనకల్లు సెప్టెంబర్ 9, ( నేటి దర్శిని )**
తనకల్లు మండలంలోని రెడ్డివారిపల్లి గ్రామంలో మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే మాసమస్య తీర్చాలని, గ్రామస్తులు,మహిళలు తనకల్లు పంచాయతీ కార్యదర్శి కృష్ణ మూర్తి రెడ్డికి బుదవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డివారిపల్లి,గుంజువారిపల్లి,హరిజనవాడలకు కలిసి రెండు బోర్లు ఉన్నాయని వాటిలో నీరు అడుగంటి,తక్కువగా నీరు వస్తుందోని,మూడు గ్రామాలకు ఆ నీరు సరిపోవడం లేదని వారు వాపోయారు. మా గ్రామానికి వచ్చే అరకొరనీటి పైపు లైనుకు అక్రమంగా కనెక్షన్ తీసుకొని హరిజనవాడలో కొంతమంది మోటార్లు వేసుకోవడంతో ఆనీరు కూడా రావడం లేదని రాత్రంతా మేలుకొని కొళాయి దగ్గర ఉన్నా పది బిందుల నీరు రావడం లేదంటే నీటి తీవ్రత ఎంత ఎక్కువగా ఉందొ అర్థం చేసుకోవాలన్నారు, మంచి నీటి ట్యాంకుల ద్వారా మా గ్రామానికి మంచినీటిని పంపిణి చేయాలని,క్రొత్త బోరు వేసి మాసమస్య తీరేలా చూడాలని ఆయనకు మొర పెట్టుకొన్నారు. సెక్రటరీ కృష్ణ మూర్తి రెడ్డి మాట్లాడుతూ మా సిబ్బందిని హరిజనవాడకు పంపించి అక్రమంగా పైపులైను తీసుకొన్న వాటిని తొలగిస్తామని, అలాగే క్రొత్త బోరువేసే విషయం, ట్యాంకర్ల ద్వారా మంచినీటి పంపిణి గురించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించి బోర్ వేసేలా చూస్తామని అయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పెరిగే ధరలకు హద్దే లేదు..



**తనకల్లు సెప్టెంబర్ 9, ( నేటి దర్శిని )**
తనకల్లు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సీపీఐ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో జరిగింది. రోజువారీ ఇంట్లో వాడే చక్కెర, పప్పు, నూనె వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యులు, పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయకులు మండిపడ్డారు. "పెరిగే ధరలకు హద్దే లేదు.. అనే నినాదాలతో ధర్నా ప్రాంతం దద్దరిల్లింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి, పెరిగిన ధరలను తగ్గించి సామాన్యుడు బతికేలా చూడాలని, లేకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కదిరి సీపీఐ డివిజన్ కార్యదర్శి పవన్, తనకల్లు మండల కార్యదర్శి రెడ్డప్ప, సహాయ కార్యదర్శి రవి, గిరిజన సంఘం నాయకులు రవీందర్ నాయక్, నాయకులు రెడ్డప్ప, రవి, నిరంజన్, రమణమూర్తి, మురళి, గిరి, బాలు తదితరులు.

# మూడేళ్ల క్రితం అక్రమ అరెస్టు...
# నేడు ప్రజా తీర్పుతో తిరిగి సీఎం పీఠం!

**-నిప్పును అరెస్టు చేయగలరా?**
**-చంద్రబాబు అరెస్టుపై నందికొట్కూరు టీడీపీ ఫైర్**
**-ఆనాడు అరెస్టు.. ఈనాడు అధికారం**



**నందికొట్కూరు, సెప్టెంబర్ 9, ( నేటి దర్శిని )**
సీఎం చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నందికొట్కూరులో టీడీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి మరియు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఆదేశాల మేరకు నందికొట్కూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయం సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. యువనేత నారా లోకేష్ పిలుపు మేరకు నిజం గెలవాలి అనే నినాదంతో పార్టీ కార్యాలయంలో కొవ్వొత్తులను వెలిగించి చంద్రబాబుకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ 53 రోజుల పాటు చంద్రబాబు జైలులో ఉన్నా తెలుగుదేశం కార్యకర్తల మనోధైర్యం ఏమాత్రం తగ్గలేదని అదే స్ఫూర్తితో 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమికి బ్రహ్మరథం పట్టారని గుర్తు చేశారు. చంద్రబాబు అరెస్టు సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా యువత మహిళలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి నిరసన తెలపడం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో కూడా అనాడు జరిగిన నిరసనలు ఉద్యమ స్ఫూర్తిని నింపాయని పేర్కొన్నారు. అప్పట్లో చంద్రబాబుపై పెట్టిన కేసులు పూర్తిగా అసత్యమైనవని, రాజకీయ కక్షసాధింపులో భాగంగానే అరెస్టు చేశారని పేర్కొన్నారు. ప్రజల కోసం నిబద్ధతతో నిజాయితీగా పని చేసే నాయకుడిని అప్రజాస్వామికంగా అణచివేయాలని చూసినా అంతిమంగా న్యాయమే గెలిచిందని స్పష్టం చేశారు. కష్టాలను ఎదుర్కొంటూ నిప్పులాంటి రాజకీయం చేసిన చంద్రబాబు ప్రజాక్షేత్రంలో గెలిచి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ప్రజల విజయం అని నాయకులు కార్యకర్తలు కొనియాడారు.


# స్టన్నింగ్‌గా 'సీన్' టైటిల్ టీజర్




ఇటీవలే విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాతో మంచి సక్సెస్ అందుకున్నాడు కోలీవుడ్ స్టార్ హీరో సూర్య. ఈ టాలెంటెడ్ యాక్టర్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మరో ప్రాజెక్ట్ సూర్య 47. 'ఆవేశం' లాంటి బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని తెరకెక్కించిన జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాకు 'సీన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు వార్తలు హల్ చల్ చేసిన విషయం తెలిసిందే. అయితే అభిమానుల్లో నెలకొన్న క్యూరియాసిటీకి చెక్ పెట్టారు మేకర్స్. ఈ చిత్రానికి ముందుగా వార్తలు వచ్చినట్టుగా సీన్ టైటిల్‌ను ఫైనల్ చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ టైటిల్ టీజర్ కూడా రిలీజ్ చేశారు. షార్ట్ అండ్ టీ షర్ట్‌లో నయా మేకోవర్‌లో కనిపిస్తూ స్టైలిష్ ఎంట్రీ ఇచ్చిఅదరగొట్టేస్తున్నాడు సూర్య. పోలీసాఫీసర్ భుజంపై చేయి వేసి జైలులో ఖైదీల మధ్య నుంచి నడుచుకుంటూ రావడం చూడొచ్చు. మొత్తానికి ఈ సారి సూర్యలోని నయా యాంగిల్‌నుచూపించబోతున్నట్టు టైటిల్ టీజర్ చెప్పకనే చెబుతోంది. ఈ మూవీలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, 'ప్రేమలు' ఫేమ్ మలయాళ యువ నటుడు నస్లెన్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. విభిన్నమైన యాక్షన్-కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ మలయాళ సంగీత దర్శకుడు సుశిన్ శ్యామ్ పనిచేస్తున్నాడు. ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# 'రణబాలి' టీజర్‌తో విజయ్ దేవరకొండ మాస్ కంబ్యాక్..

**- ఊహించని విజువల్స్‌తో దుమ్మురేపిన టీజర్!**




టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ హీరోగా, నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'టాక్సీ డ్రైవర్', 'శ్యామ్ సింగ రాయ్' వంటి విభిన్నమైన కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే సినిమా నుంచి వచ్చిన అప్డేట్స్ ఆసక్తిని పెంచగా.. తాజాగా విడుదలైన టీజర్ మాత్రం అంచనాలను మరింతగా పెంచేసింది. 'రణబాలి' టీజర్‌ను గమనిస్తే.. చరిత్ర పుటల్లో పెద్దగా ప్రస్తావ-నకు రాని ఓ స్వాతంత్ర్య సమరయోధుడి జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఈ కథను రూపొందించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బ్రిటిష్ పాలన సమయంలో భారతీయులు ఎదుర్కొన్న అణచివేత, బాధలు, పోరాటాలను దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ చాలా హార్డ్ హిట్టింగ్‌గా చూపించినట్లు టీజర్‌తో అర్థమవుతోంది.సాధారణంగా స్వాతంత్ర్య పోరాటం నేపథ్యంలో వచ్చే సినిమాలకు భిన్నంగా.. ఇందులో కథను మరింత రా అండ్ ఇంటెన్స్‌గా ప్రజెంట్ చేసినట్లు కనిపిస్తోంది. టీజర్‌లో కనిపించే వాతావరణం, పాత్రల డిజైన్, భారీ సెట్స్, యాక్షన్ బ్లాక్స్ సినిమాను మరో స్థాయిలో నిలబెట్టేలా ఉన్నాయి. టీజర్‌లో విలన్ పాత్రను కూడా అత్యంత క్రూరంగా, పవర్‌ఫుల్‌గా చూపించినట్లు కనిపిస్తోంది. హీరోకు ఎదురుగా నిలిచే ప్రధాన ప్రతినాయకుడిని సాలిడ్‌గా ఎస్టాబ్లిష్ చేస్తూ.. ఆ తర్వాత విజయ్ దేవరకొండ పాత్రను ఎలివేట్ చేసిన విధానం టీజర్‌లో హైలైట్‌గా నిలిచింది. ముఖ్యంగా విజయ్ ఎంట్రీ నుంచి వచ్చే సన్నివేశాలు అభిమానులకు ఫుల్ మీల్స్ అందించేలా ఉన్నాయి. డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ సీన్స్‌లో ఇప్పటివరకు చూడని కొత్త షేడ్స్‌లో విజయ్ కనిపించాడు. విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే ఇది మరో డిఫరెంట్ పాత్రగా నిలిచే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. టీజర్‌లో ఆయన లుక్, నడక, చూపులు, డైలాగ్ చెప్పే విధానం చూస్తే.. నటుడిగా విజయ్ తనను తాను మరోసారి కొత్తగా ప్రజెంట్ చేయడానికి ప్రయత్నించినట్లు అనిపిస్తోంది. ముఖ్యంగా పాత్రలోకి పూర్తిగా లీనమైన తీరు ఆకట్టుకుంటోంది. కొన్ని సన్నివేశాల్లో విజయ్ దేవరకొండ అనే స్టార్ కనిపించకుండా.. కేవలం 'రణబాలి' అనే పాత్ర మాత్రమే కనిపించేలా పెర్ఫార్మెన్స్ ఇచ్చినట్లు టీజర్ సూచిస్తోంది. ఈ సినిమాపై విజయ్ అభిమానుల్లో మరింత ఆసక్తి పెరగడానికి ఇదే ప్రధాన కారణంగా మారింది. 'రణబాలి' టీజర్‌లో మరో ప్రధాన ఆకర్షణ సినిమా విజువల్స్. బ్రిటిష్ కాలం నాటి వాతావరణాన్ని తెరపైకి తీసుకురావడానికి భారీ సెట్స్‌తో పాటు సినిమాటిక్ ఫ్రేమింగ్‌ను ఉపయోగించినట్లు కనిపిస్తోంది. కెమెరా వర్క్ కూడా టీజర్‌కు మరింత బలాన్ని ఇచ్చింది. యాక్షన్ సన్నివేశాలు, యుద్ధ వాతావరణం, పాత్రల ఎమోషన్స్‌ను కెమెరాలో క్యాప్చర్ చేసిన విధానం సినిమాపై అంచనాలను పెంచుతోంది. పెద్ద స్క్రీన్‌పై ఈ విజువల్స్ మరింత అద్భుతంగా ఉండే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టీజర్‌లో వినిపించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా సినిమాకు ఉన్న ఇంటెన్సిటీని మరింత పెంచేలా ఉంది. యాక్షన్, ఎమోషన్, దేశభక్తి అంశాలకు తగ్గట్టుగా సంగీతాన్ని డిజైన్ చేసినట్లు అనిపిస్తోంది. టీజర్‌ను చూస్తున్నంతసేపు ప్రేక్షకుడిని కథలోకి లాగేసేలా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పనిచేసింది. కొంతకాలంగా సరైన కమర్షియల్ సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న విజయ్ దేవరకొండకు 'రణబాలి' ఒక కీలకమైన సినిమా. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాహుల్ సంకృత్యాన్ లాంటి విభిన్నమైన కథలను తెరకెక్కించే దర్శకుడు ఉండటంతో అంచనాలు భారీగా ఉన్నాయి.

# ముంబైకి శ్రీలీల షిఫ్ట్..!

**బాలీవుడ్ మూవీలపైనే ధ్యాస?**



దక్షిణాది చిత్రసీమలో తన డ్యాన్స్, గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రీలీల ప్రస్తుతం బాలీవుడ్‌పై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు హైదరాబాద్‌లో ఉంటూ వరుస టాలీవుడ్ సినిమాల్లో నటించిన ఈ బ్యూటీ.. ఇక ముంబైకి శాశ్వతంగా షిఫ్ట్ అయ్యేందుకు ప్లాన్ చేస్తున్నట్లు ఫిలింనగర్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్‌లో వరుస అవకాశాలు వస్తుండటంతో ముంబైలో సొంత ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ కోసం శ్రీలీల వెతుకుతున్నట్లు సమాచారం. ఇప్పటికే యువ హీరో కార్తీక్ ఆర్యన్‌తో పాటు పలువురు బాలీవుడ్ కథానాయకుల సినిమాల్లో అవకాశాలు అందుకుంటున్న ఆమె.. దక్షిణాది నుంచి బాలీవుడ్‌లో తన మార్క్ చూపించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ముంబైకి షిఫ్ట్ అయితే టాలీవుడ్‌కు శ్రీలీల దూరమవుతారా? అనే చర్చ కూడా మొదలైంది. హైదరాబాద్ నుంచి బాలీవుడ్‌ను బ్యాలెన్స్ చేస్తూ ముందుకు సాగితే రెండు పరిశ్రమల్లోనూ అవకాశాలను కొనసాగించవచ్చని అభిమానులు, సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రస్తుతం శ్రీలీల ముంబై షిఫ్ట్ వార్త ఎంతవరకు నిజమవుతుందో చూడాలి.

# అందంతో ఆకట్టుకున్న ఆషికా

**-సర్దార్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆషికా రంగనాథ్..**

**- బ్లాక్ అండ్ వైట్ శారీలో అదిరిపోయే లుక్**

కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ నటించిన 'సర్దార్ 2' తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. చిత్ర బృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్న ఈ వేడుక అభిమానుల్లో సందడి నింపింది. ఈ కార్యక్రమంలో హీరోయిన్ ఆషికా రంగనాథ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఆషికా రంగనాథ్ ఎంతో స్టైలిష్‌గా కనిపించారు. బ్లాక్ అండ్ వైట్ స్ట్రిప్స్‌తో కూడిన చీరలో ఈవెంట్‌కు హాజరైన ఆమె.. సంప్రదాయ, ఆధునిక శైలుల కలయికగా కనిపించారు. చీరకు తగ్గట్టుగా బ్లాక్ కలర్ డిజైనర్ బ్లౌజ్‌ను ధరించారు. బ్లౌజ్‌పై ఉన్న నెట్ డిజైన్, ప్రత్యేకమైన నెక్ లైన్ ఆమె లుక్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి లూజ్‌గా వదిలిన హెయిర్, సింపుల్ మేకప్‌తో ఆషికా తన అందాన్ని మరింత హైలైట్ చేశారు. పొడవాటి ఇయర్ రింగ్స్ ఆమె లుక్‌కు అదనపు ఆకర్షణగా నిలిచాయి. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా ఎలిగెంట్‌గా కనిపిస్తూ ఫోటోగ్రాఫర్లకు పోజులిచ్చారు. ముఖ్యంగా చీర కొంగును స్టైలిష్‌గా క్యారీ చేస్తూ, చేతులు జోడించి చిరునవ్వుతో ఆమె ఇచ్చిన పోజులు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకకు హాజరైన అభిమానులు ఆషికాను చూసి సందడి చేశారు. ఈ సందర్భంగా తీసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.



# నేడు ప్రేక్షకుల ముందుకు రానున్న 'మండాడి'




సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామా 'మండాడి' నేడు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్‌పై మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంపై ఇప్పటికే సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మహిమా నంబియార్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ కీలక పాత్రలు పోషించారు. తెలుగు రాష్ట్రాల్లో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి ఈ సినిమాను అత్యంత భారీ ఎత్తున విడుదల చేస్తోంది. తాజాగా ఈ చిత్ర సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ బోర్డ్ ఈ సినిమాకి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. మూవీ చూసిన సెన్సార్ టీం సభ్యులు అద్భుతంగా వచ్చిందని అభినందించారు. ముఖ్యంగా ఇందులో వచ్చే బోట్ సీక్వెన్సెస్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయని, థియేటర్లలో ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెట్టడం ఖాయమని కొనియాడారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, మైండ్ బ్లోయింగ్ ట్రైలర్ సినిమాపై హైప్‌ను రెట్టింపు చేశాయి. మ్యూజిక్ సెన్సేషన్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన నేపథ్య సంగీతం సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఎస్.ఆర్. కథిర్ విజువల్స్ ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో గ్రాండ్‌గా, విజువల్ ఫీస్ట్‌లా మలిచాయి.పీటర్ హెయిన్, దిలీప్ సుబ్బురాయన్, మహేష్ మాథ్యూ కంపోజ్ చేసిన యాక్షన్ సీక్వెన్సులు మాస్, యాక్షన్ ప్రియులను థ్రిల్ చేయనున్నాయి. స్టార్ డైరెక్టర్ వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించడం ఈ ప్రాజెక్ట్‌కి బలాన్ని చేకూర్చింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ అవుతున్న ఈ చిత్రానికి అడ్వాన్స్ బుకింగ్స్ అద్భుతంగా జరుగుతున్నాయి. బుక్ మై షోలో ప్రతి గంటకూ వేలాది టికెట్లు అమ్ముడవుతుండటం సినిమాపై ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. సుహాస్, సూరి ఇద్దరి కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ సాధించే చిత్రంగా నిలవబోతోంది.


Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450